# సాక్షి ఖమ్మం

శుక్రవారం । 22 । మార్చి । 2024






## సీసీఐ విక్రయాలకు తెర

జిల్లాలో పత్తికి ప్రైవేట్ మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ లభిస్తుండడంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను మూసివేశారు. 8లో




## యథేచ్ఛగా ఇసుక రవాణా

తిరుమలాయపాలెం మండలంలోని ఆకేరు, పాలేరు వాగుల ద్వారా అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. 8లో




## వాతావరణం

జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లగానే ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఎండ వచ్చినా కనిష్టస్థాయిలోనే ఉష్ణోగ్రత నమోదవుతుంది.




## న్యూస్‌రీల్

### ఎస్సెస్సీ పరీక్షకు 47మంది గైర్హాజరు



ఖమ్మం సహకారనగర్: పదో తరగతి పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని 97కేంద్రాల్లో గురువారం జరిగిన పరీక్షకు 16,586మంది విద్యార్థులకు 16,526మంది హాజరుకాగా 47మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిశీలకుడు మదన్మోహన్ ఆరు కేంద్రాలను తనిఖీ చేయగా, తనతో పాటు అసిస్టెంట్ కమిషనర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సైతం పలు కేంద్రాలను తనిఖీ చేశాయని డీఈఓ వెల్లడించచారు.

### పరీక్షా కేంద్రాల్లో తనిఖీ

కూసుమంచి/ముదిగొండ/చింతకాని: కూసుమంచి జెడ్పీహెచ్‌ఎస్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రంతో పాటు ముదిగొండ మండలం మేడేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం రాష్ట్ర పరిశీలకులు, విద్యాశాఖ జేడీ మదన్‌మోహన్ తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేయాలని ఎంఈఓ రామాచారి, అధికారులకు సూచించారు. అలాగే, చింతకాని మండలం నాగులవంచ, పందిళ్లపల్లిలోని కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈఓ సోమశేఖరశర్మ వేర్వేరు సమయాల్లో తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించి అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.

### తొమ్మిది నెలల శిక్షణ కీలకం



ఫైరింగ్ శిక్షణను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: వృత్తినైపుణ్యంతో విధుల్లో రాణించేలా తొమ్మిది నెలల పాటు పొందే శిక్షణ కానిస్టేబుళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సీపీ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ట్రెయినీ కానిస్టేబుళ్ల ఫైరింగ్ రేంజ్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా పర్యవేక్షించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తించేందుకు శిక్షణ కీలకమని చెప్పారు. ఈవిషయాన్ని గుర్తించి ప్రతీ అంశాన్ని అంకితభావంతో నేర్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ గణేష్, ఏసీపీలు రవి, నర్సయ్య, ఆర్‌ఐలు తిరుపతి, అప్పలనాయుడు, నాగుల మీరా తదితరులు పాల్గొన్నారు.

### రూ.3,52,133 విలువైన సామగ్రి సీజ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యాక ఆధారాలు లేకుండా తరలిస్తున్న వివిధ రకాల సామగ్రిని సీజ్ చేసినట్లు నోడల్ అధికారి మురళీధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గురువారం నాటికి 56 కేసులు నమోదు కాగా రూ.3,52,133విలువైన సామగ్రి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఇందులో రూ.50,400 విలువైన పీడీఎస్ బియ్యం ఉన్నాయని తెలిపారు. అలాగే, పోలీస్ శాఖ ఆధ్వర్యాన 11 కేసులు నమోదు రూ.72,464 విలువైన గంజాయి, మద్యం, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో 45 కేసులు నమోదు చేసి రూ.2,29,269 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

### తపాలా శాఖ పోటీల్లో జిల్లా విద్యార్థి సత్తా

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ 2023–24 సంవత్సరానికి గాను జాతీయ స్థాయిలో నిర్వహించిన లెటర్ రైటింగ్ పోటీల్లో ఖమ్మంకు చెందిన 9వ తరగతి విద్యార్థిని బి.ఆరాధ్య సత్తా చాటింది. 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అంశంపై ఇటీవల పోటీలు నిర్వహించారు. ఇందులో 18ఏళ్ల లోపు కేటగిరీలో త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ఆరాధ్య తెలంగాణ సర్కిల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిందని ఖమ్మం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. విద్యార్థినికి తపాలా శాఖ రూ. 25వేల నగదు బహుమతి ప్రకటించగా, త్వరలోనే డిపాజిట్ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# బరి గీసేదెప్పుడు?!





ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ తరఫున బరిలో ఎవరు నిలుస్తారనే అంశంపై ఉత్కంఠ కొనసాగుతోంది. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ నామా నాగేశ్వరరావును చాన్నాళ్ల క్రితమే ప్రకటించింది. కాంగ్రెస్, బీజేపీ మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. త్వరలోనే అన్ని స్థానాల అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా వెల్లడించగా.. గురువారం ఐదు స్థానాలకు ప్రకటించారు. ఆ జాబితాలో ఖమ్మం లేకపోవడంతో ఆశావహుల అనుచరులు ఎవరికి వారు తమ నేతే అభ్యర్థి అంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

### కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై ఉత్కంఠ

- ఖమ్మం లోక్‌సభ స్థానం కోసం హస్తిన స్థాయిలో కసరత్తు
- త్వరలోనే ప్రకటన అంటూ సీఎం సంకేతాలు
- ఆచితూచి వ్యవహరిస్తున్న బీజేపీ పెద్దలు
- అభ్యర్థుల ఎంపికలో ఆలస్యంతో శ్రేణుల ఎదురుచూపులు

**ఢిల్లీలో ఖమ్మం రాజకీయం**

కాంగ్రెస్, బీజేపీలు ఖమ్మం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు హస్తినలో కసరత్తు చేస్తున్నాయి. ఆశావహులు ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలో అధిష్టానం పెద్దలను కలిశారు. తమకు టికెట్ ఇస్తే గెలుపు సునాయాసమంటూ ప్రొఫైల్‌ను పార్టీ పెద్దల ముందు పెట్టారు. రాష్ట్రానికి చెందిన పార్టీ ముఖ్యులతో కూడా బలంగా సిఫారసు చేయిస్తున్నారు. ఆయా పార్టీల కేంద్ర కార్యాలయాల్లో ఏం జరుగుతోంది, టికెట్ కోసం ఎవరెవరు వస్తున్నారనే అంశంపై ఆశావహులు పోటాపోటీగా ఆరా తీస్తుండడం గమనార్హం. త్వరలోనే రాష్ట్రంలోని మిగిలిన అన్ని స్థానాలకు రెండు పార్టీలు అభ్యర్థులను ఖరారు చేస్తాయన్న ప్రచారంతో ఆశావహులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. టికెట్ దక్కించుకునేందుకు ఉన్న ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు.

**కాంగి'రేస్'..**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ ఖమ్మం అభ్యర్థిగా ఎవరిని ఖరారు చేస్తుందనే అంశంపై ప్రతిపక్షాలు సైతం ఎదురుచూస్తున్నాయి. పోటీలో నిలబడే అభ్యర్థి పార్టీపరంగా, సామాజిక సమీకరణాల నేపథ్యంగా తమ అభ్యర్థికి సమఉజ్జీగా ఉంటాడా.. లేక అంతకు మించి బలంగా ఉంటాడా అనే కోణంలో అటు బీఆర్‌ఎస్, ఇటు బీజేపీ అంచనాల్లో మునిగితేలుతున్నాయి. ప్రతిపక్షాల లెక్కలు ఇలా ఉంటే కాంగ్రెస్‌లో ఆశావహులు మాత్రం టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలను పలుమార్లు కలిసి టికెట్ తమకే ఇవ్వాలని పట్టుబడుతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీలోనూ రెండుసార్లు ఈ సీటుపై చర్చ జరిగింది. నెలాఖరులోగా అధిష్టానం అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించనుందని సీఎం సంకేతాలు ఇవ్వడంతో ఆశావహుల్లో ఆందోళన పెరుగుతోంది.

**వేచిచూస్తున్న 'కమలం'**

ఖమ్మం అభ్యర్థి ప్రకటనపై బీజేపీ వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు కమలం గూటికి చేరారు. టికెట్ హామీతోనే ఆయన బీజేపీలో చేరారని అనుచరులు చెబుతుండగా.. ఆయననే పార్టీ సైతం ఖమ్మం అభ్యర్థిగా బరిలోకి దింపుతుందనే ప్రచారం సాగింది. అయినా ఇప్పటి వరకు ప్రకటించకపోవడంతో.. బీజేపీ మరింత బలమైన అభ్యర్థి కోసం అన్వేషణలో ఉందనే చర్చ మొదలైంది. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీని పార్టీలో చేర్చుకుని పోటీలో దింపాలనే యోచనతోనే చివరి వరకు వేచిచూడాలనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. సదరు ఎంపీ బీజేపీలో చేరకపోతే పార్టీ అభ్యర్థిగా జలగంనే ప్రకటిస్తారని చెబుతున్నారు. ఇలా ఎవరికి వారు సమీకరణల్లో మునిగి తేలుతుండడంతో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలో కొనసాగుతున్న సస్పెన్స్ ఆశావహులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

**ఏకాభిప్రాయం కోసం భేటీ**

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై పీటముడి వీడకపోవడంతో అధిష్టానం స్థానికంగానే భేటీ అయి ఏకాభిప్రాయానికి రావాలని సూచించినట్లు సమాచారం. ఇందులో భాగంగా గురువారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, రాగమయి హైదరాబాద్‌లో రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో సమావేశమయ్యారు. అభ్యర్థిగా ఎవరిని నిలబెడితే గెలవడమే కాక మెజార్టీ ఎక్కువ వస్తుందన్న అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఆశావాహులు ఎవరెవరు, పోటీలో ఎవరిని పెడితే బాగుంటుందనే అంశంపై ఆమె మంత్రులు, ఎమ్మెల్యేల అభిప్రాయం సేకరించినట్లు తెలిసింది. ఇక్కడ ఏకాభిప్రాయానికి వచ్చాక ఆ నిర్ణయాన్ని కాంగ్రెస్ ఎన్నికల కమిటీకి నివేదించనున్నట్లు సమాచారం.

# ఎవరికీ ఇబ్బంది ఎదురుకావొద్దు

- పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి
- పలు సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్



పోలింగ్ కేంద్రంలో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కస్బాబజార్, సుందరయ్య నగర్, ఖాజీపుర, శాంతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెంటర్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్ తదితర అన్ని సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేనిచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కేంద్రాల్లో అవసరమైన చోట పెయింటింగ్ వేయాలని, టాయిలెట్లలో రన్నింగ్ వాటర్ సమకూర్చాలని చెప్పారు. భద్రతాపరంగా కూడా ఏర్పాట్లపై దృష్టి సారించి ప్రహరీలు లేని చోట వెంటనే నిర్మించాలని సూచించారు. ఒకే ఆవరణలో ఒకటి కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉంటే క్యూ, రద్దీ నెలకొనకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఓటర్లకు అవగాహన కల్పించేలా ప్రహరీలపై నినాదాలు రాయించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఎంఈఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ సీహెచ్.స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఓటుహక్కు ఉందా..?!

- లేకపోతే దరఖాస్తు చేసుకోండి
- వచ్చేనెల 15వ తేదీ వరకు అవకాశం
- తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసే వెసులుబాటు

ఖమ్మం సహకారనగర్: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నాయి. అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకునేలా అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. గత నెల 8వ తేదీన ఓటర్ల తుది జాబితా విడుదల చేయగా, జిల్లాలో 12,19,243మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడైంది. ఇందులో పురుషులు 5,88,243 మంది, మహిళలు 6,30,913మంది, ఇతరులు 87మంది ఉన్నారు. అయితే, ఇంకా అర్హులెవరైనా మిగిలిపోతే ఓటరుగా నమోదుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈమేరకు జాబితా పరిశీలించుకుని నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**గతంతో పోలిస్తే భిన్నంగా..**

గతంలో ఏటా జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించేవారు. ఆతర్వాత ప్రతీ నాలుగు నెలలకోసారి ఓటర్ల నమోదు దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఏడాదిలో 365రోజుల పాటు ఓటు నమోదుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ వచ్చే నెల 15వ తేదీ వరకు ఫారం–6 ఓటు నమోదు, ఫారం–8 చిరునామా మార్పునకు దరఖాస్తు చేసుకునేలా గడువు విధించారు. ఆతర్వాత కూడా దరఖాస్తుకు అవకాశమున్నప్పటికీ... ఏప్రిల్ 15వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకున్న వారికే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం లభించనుంది.



**యువతలో అవగాహన**

మూడు నెలల క్రితం అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు జిల్లా యంత్రాంగం ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా కళాశాలలతో పాటు ఇతరచోట్ల అవగాహన కల్పించి 18ఏళ్లు నిండిన అందరితో ఓటు నమోదు చేయించారు. ఇంకా మిగిలిపోయిన వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**పరిశీలన, నమోదు ఇలా...**

ఓటు హక్కు ఉందో, లేదో చూడడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు https:://nvsp.in, ceotelangana.nic.in వెబ్‌సైట్ల ద్వారా అవకాశముంది. అలాగే, voterhelp యాప్ ద్వారా పరిశీలించి నమోదు చేసుకోవచ్చు.

# ఎన్నికల నిబంధనలు పాటించండి

**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం సహకారనగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యాన ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రింటింగ్ ప్రెస్‌లు, పెట్రోల్ బంక్‌లు, జ్యూయెలరీ షాపుల యజమానుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రచార సామగ్రిని ముద్రించే సమయాన నిర్ణీత ప్రొఫార్మాల్లో వివరాలు, డిక్లరేషన్లు తప్పనిసరి తీసుకోవాలని తెలిపారు. అలాగే, పోస్టర్లు, కరపత్రాలతో ప్రచురణ కర్తల వివరాలు పొందుపర్చాలని పేర్కొన్నారు. ఇక పెట్రోల్ బంక్‌లు, జ్యూయెలరీ షాపుల యజమానులు రోజువారి లావాదేవీల వివరాలు అందించాలని సూచించారు. ఈసమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి మురళీధర్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**పోలింగ్‌కేంద్రాల పరిశీలన**

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు, కండ్రిక, బంజర, జమలాపురం, వెంకటాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను గురువారం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్‌నాయక్‌తో కలిసి కేంద్రాలను పరిశీలించిన ఆయన వసతుల కల్పనపై సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ పక్కాగా అమయ్యేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీఓ జి.శ్రీలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## లంచం అడిగితే సమాచారం ఇవ్వండి

ఖమ్మంక్రైం: ప్రభుత్వ ఉద్యోగులు పని చేసేందుకు డబ్బు డిమాండ్ చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ రమేష్ సూచించారు. ఈమేరకు 91543 88981(డీఎస్పీ), 91543 88984, 91543 88986, 91543 88987(సీఐలు) నంబర్లకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ ఓ ప్రకటనలో తెలిపారు.

## నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించిన అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

# సాఫీగా వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు

- ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి
- హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్



డీఎంహెచ్‌ఓ మాలతి, అధికారులతో సమీక్షిస్తున్న హెల్త్ డైరెక్టర్ రవీందర్‌నాయక్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో వైద్య, ఆరోగ్య కార్యక్రమాలు సాఫీగా సాగేలా ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు(డీహెచ్) డాక్టర్ రవీందర్ నాయక్ ఆదేశించారు. జిల్లాలో గురువారం పర్యటించిన ఆయన డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మాతా, శిశు సంక్షేమం, ఇమ్యూనైజేషన్, జాతీయ ఆరోగ్య మిషన్, జాతీయ కీటక జనిత రోగ నివారణ, జాతీయ కుష్ఠు నివారణ, అసంక్రమణ వ్యాధుల నివారణ తదితర కార్యక్రమాలపై వివరాలు ఆరా తీశారు. ప్రోగ్రాం అధికారులు కార్యక్రమాల అమలులో నిబద్ధతతో వ్యవహరిస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో అధికారులు చొరవ చూపుతూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానానికి చేర్చాలని చెప్పారు. అలాగే, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ సైదులు, డాక్టర్ సీతారాం, డీఐఓ డాక్టర్ ప్రమీల, డాక్టర్ చందునాయక్, డీఎల్‌ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ భాస్కర్‌నాయక్, డెమో కాశీనాథ్, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ నీలోహన తదితరులు పాల్గొన్నారు

**పీహెచ్‌సీలో తనిఖీ**

కూసుమంచి: కూసుమంచిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వసతులు, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలను వైద్యాధికారి కిషోర్ ద్వారా తెలుసుకోగా, కేంద్రప్రభుత్వ పథకాల అమలు తీరుపైనా ఆరా తీశారు. ఇమ్యూనైజేషన్, రికార్డుల ఆన్‌లైన్ నమోదు వివరాలు తెలుసుకుని సూచనలు చేశారు. ప్రతీ అంశాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని తెలిపారు. డీహెచ్ వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి ఉన్నారు.

# అట్టడుగు స్థానంలో జిల్లా

- ఎస్‌హెచ్‌జీలకు రుణాల మంజూరులో సెర్ప్ నిర్లక్ష్యం
- ఫలితంగా ఆర్థిక స్వావలంబన కోల్పోతున్న మహిళలు
- రూ.931.57 కోట్ల లక్ష్యానికి.. రూ.738.31 కోట్లే మంజూరు
- రాష్ట్రంలో 31వ స్థానానికి పడిపోయిన ఖమ్మం



ఖమ్మంమయూరిసెంటర్: ప్రతీ మహిళ ఆర్థిక సాధికారిత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు అనేక పథకాలను తీసుకొస్తున్నాయి. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల్లో సంఘాలుగా ఏర్పడిన మహిళలకు లింకేజీ రుణాలు జారీ చేస్తుండగా.. ఈ నిధులతో స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ఈక్రమంలోనే రుణాలను సద్వినియోగం చేసుకుని సక్రమంగా తిరిగి చెల్లిస్తున్న సంఘాలకు పరిమితి ఏటా పెంచుతున్నారు. ఈమేరకు రుణాల మంజూరులో గత పదేళ్ల పరిశీలిస్తే మొదటి పది స్థానాల్లో నిలిచే జిల్లా ఈ ఏడాది మాత్రం వెనకబడింది. సెర్ప్ అధికారులు, సిబ్బంది తీరుతో మహిళా సంఘాలకు ఆశించిన స్థాయిలో రుణాలు అందలేదు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.931.57 కోట్ల రుణలక్ష్యంలో రూ.738.31 కోట్లే మంజూరు చేయగా రాష్ట్రంలో 31వ స్థానానికి పడిపోయింది.

**పట్టించుకోని అధికారులు..**

మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించడంలో జిల్లా రాష్ట్రంలో అగ్రభాగాన నిలిచేది. పలుమార్లు ఈ విషయంలో జిల్లాకు అవార్డులు, ప్రశంసలు దక్కాయి. జిల్లా మహిళలు చైతన్యం కలిగి ఉండడం, బ్యాంకు రుణాలను వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి లాభాలు సాధిస్తుండడంతో కొన్నేళ్లుగా ప్రభుత్వం భారీగానే రుణ లక్ష్యాన్ని కేటాయిస్తోంది. ఐదేళ్ల క్రితం జిల్లాకు రూ.500 కోట్లు లోపే రుణ లక్ష్యం ఉండగా.. పెరిగిన సంఘాలు, రుణంపై మహిళలు ఆసక్తి చూపించడం, రికవరీ బాగుండడంతో ఈ ఏడాది రూ.931.57 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఆర్థిక సంవత్సరం చివరకు వచ్చినా లక్ష్యాన్ని చేరుకోలేదు. ప్రధానంగా సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది, గ్రామదీపికల అలసత్వంతోనే మహిళలకు రుణాలు సకాలంలో అందలేదనే ఆరోపణలున్నాయి. డీఆర్‌డీఓ మొదలు బ్యాంక్ లింకేజీ విభాగం ఉద్యోగులు నిత్యం రుణ మంజూరుపై సమీక్షలు నిర్వహించేవారు. ఈ ఏడాది ఆ దిశగా అధికారులు చొరవ చూపకపోవడంతో జిల్లా వెనుకబడింది.

**కింద నుంచి రెండో స్థానం**

రాష్ట్రంలో నిజామాబాద్ తర్వాత ఖమ్మం జిల్లాకు రుణ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. నిజామాబాద్ జిల్లాలో 18,905 సంఘాలకు రూ.1,032.74 కోట్లు రుణాలు ఇవ్వాలనేది లక్ష్యం కాగా, ఖమ్మం జిల్లాలో 16,640 సంఘాలకు రూ.931.57 కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉంది. ఇందులో నిజామాబాద్ అధికారులు లక్ష్యానికి మించి 18,392 సంఘాలకు రూ.1,095.25 కోట్ల రుణాన్ని మహిళా సంఘాలకు ఇప్పించారు. కానీ ఖమ్మం మాత్రం ఇప్పటివరకు 12,758 సంఘాలకు రూ.738.31 కోట్లు మాత్రమే ఇచ్చి 31వ(కింద నుండి రెండు) స్థానంలో నిలిచింది. ఇక పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులు సైతం లక్ష్యం ప్రకారం మహిళా సంఘాలకు రుణాలను అందజేసి 18వ స్థానంలో నిలవడం విశేషం.

**పూర్తిచేస్తాం...**

రుణలక్ష్యాలపై డీఆర్‌డీఓ సన్యాసయ్యను వివరణ కోరగా.. సంఘాలకు లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈనెల 31నాటికి ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేస్తామని వెల్లడించారు.

**మండలాల వారీగా లింకేజీ రుణాల లక్ష్యం, మంజూరు (రూ.కోట్లల్లో)**

| మండలం | లక్ష్యం సంఘాలు | లక్ష్యం నగదు | మంజూరు సంఘాలు | మంజూరు నగదు |
|---|---|---|---|---|
| ఖమ్మం రూరల్ | 1,121 | 64.08 | 725 | 55.55 |
| తల్లాడ | 886 | 52.77 | 567 | 45.81 |
| ముదిగొండ | 1,027 | 56.34 | 691 | 45.05 |
| నేలకొండపల్లి | 908 | 49.66 | 872 | 44.25 |
| వేంసూరు | 701 | 40.32 | 685 | 42.13 |
| రఘునాథపాలెం | 862 | 45.74 | 775 | 39.74 |
| తిరుమలాయపాలెం | 1,192 | 67.65 | 859 | 39.67 |
| ఎర్రుపాలెం | 701 | 42.61 | 631 | 39.50 |
| కూసుమంచి | 920 | 51.62 | 790 | 37.63 |
| కారేపల్లి | 720 | 36.70 | 813 | 36.71 |
| కల్లూరు | 988 | 54.18 | 457 | 35.60 |
| సత్తుపల్లి | 728 | 38.58 | 771 | 35.29 |
| వైరా | 599 | 34.39 | 523 | 34.09 |
| చింతకాని | 760 | 38.68 | 642 | 33.22 |
| పెనుబల్లి | 887 | 55.90 | 686 | 33.45 |
| కొణిజర్ల | 960 | 53.73 | 544 | 32.42 |
| ఏన్కూరు | 713 | 41.09 | 399 | 31.41 |
| మధిర | 599 | 31.74 | 507 | 26.99 |
| కామేపల్లి | 631 | 33.44 | 411 | 26.72 |
| బోనకల్ | 737 | 42.25 | 410 | 22.98 |

## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాల్లో అసిస్టెంట్ కలెక్టర్ పరిశీలన


నాగులవంచ కేంద్రంలో పరిశీలిస్తున్న మయాంక్ సింగ్

చింతకాని: మండలంలోని నాగులవంచ, జగన్నాథపురం, నాగులవంచ రైల్వేకాలనీ, ప్రొద్దుటూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్ గురువారం పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన పోలింగ్ కేంద్రాల్లోని వసతులపై ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ప్రహరీలపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు జయశ్రీ, వినోద్‌కుమార్, విజయరామారావు, ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సస్పెండ్

**బంక్ ఆస్తి పన్ను తగ్గింపులో చేతివాటం**

వైరా: వైరా మున్సిపాలిటీ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైరాలోని అయ్యప్ప క్షేత్రం సమీపాన యశ్వంత్ పెట్రోలు బంక్ ఆస్తి పన్నును నిబంధనలకు విరుద్ధంగా రివిజన్ పేరుతో భారీగా తగ్గించి బంక్ యజమాని వద్ద నుంచి లంచం తీసుకున్నట్లు శ్రీనివాసరావుపై ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణ చేపట్టగా బంక్‌కు ఏడాది పన్ను రూ.1.32 లక్షలు ఉండగా రివిజన్ పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రూ.38 వేలకు తగ్గించినట్లు తేలగా సస్పెండ్ చేశారు. కాగా, మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి శ్రీనివాసరావు యూడీసీగా విధులు నిర్వర్తిస్తుండగా.. ఇళ్లనిర్మాణ అనుమతుల విషయంలోనూ అవినీతికి పాల్పడినట్లు గతంలో ఆరోపణలు వచ్చాయి.

### కవులకు సత్కారం

ఖమ్మంగాంధీచౌక్: అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో డాక్టర్ పట్టాభి కళాపీఠం, డాక్టర్ రామసుబ్బయ్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన గురువారం జాతీయస్థాయి కవి సమ్మేళనం నిర్వహించారు. ఇందులో జిల్లాకు చెందిన పలువురు కవులు పాల్గొని తమ కవితలు వినిపించారు. జిల్లా నుంచి కొత్తపల్లి కృష్ణారావు, బుక్క సత్యనారాయణ, లెనిన్ శ్రీనివాస్, ఎడవల్లి శైలజ, తిరునగరి సంధ్య, శ్రీనివాసరావు, గుమ్మడి పుల్లయ్య, గరిడేపల్లి శోభనాద్రి, మందుల వీరభద్రం, ఎం.డీ.జహీరుద్దీన్ తదితరులు పాల్గొనగా, నిర్వాహకులు వారిని సన్మానించారు.

### రూ.3 కోట్ల అప్పులు చేసి వ్యక్తి పరార్?

సత్తుపల్లిరూరల్: వ్యాపారం చేస్తున్నానని పరిచయం పెంచుకుని అధిక వడ్డీ చెల్లిస్తానని ఆశ చూపి రూ.3 కోట్ల మేర అప్పులు చేసిన ఓ వ్యక్తి పరారైనట్లు తెలిసింది. సత్తుపల్లి మండలం తాళ్లమడకు చెందిన ఓవ్యక్తి వ్యాపారం చేస్తున్నానని స్థానికులతోపాటు సత్తుపల్లి, గంగారం బేతుపల్లి, పాకలగూడెం వాసులతో పరిచయం పెంచుకున్నాడు. ఆతర్వాత వ్యాపారాల నిమిత్తం పలువురి వద్ద అధిక వడ్డీకి పెద్ద మొత్తంలో అప్పు తీసుకున్నట్లు సమాచారం. అయితే, రెండు రోజులుగా ఆయన కనిపించకుండా పోగా ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అప్పులు ఇచ్చినవారు ఇంటికి వచ్చి వాకబు చేస్తున్నారు. ఆనోటా ఈనోట విషయం బయటకు పొక్కడంతో సదరు వ్యక్తికి సుమారు రూ.3కోట్లకు పైగా అప్పులు చేసినట్లు బయటపడిందని సమాచా రం. ఈమేరకు సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

### అద్దె ఇల్లు కావాలంటూ సైబర్ నేరం

అశ్వారావుపేటరూరల్: ఇల్లు అద్దె పేరుతో ఓ ప్రైవేటు ఉద్యోగి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాడు నగదు స్వాహా చేసిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదుచేశారు. ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్రీనివాసరావుకు ఏపీలోని విజయవాడలో సొంత ఇల్లు ఉంది. ఇల్లు అద్దెకు ఇస్తానని కొద్ది రోజుల క్రితమే ఓఎల్‌ఎక్స్‌లో వివరాలు ఉంచాడు. దీంతో ఓ సైబర్ నేరగాడు తాను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినని, ఇల్లు అద్దెకు కావాలని ఫోన్‌చేశాడు. గూగుల్ పే ద్వారా అద్దె నగదు అడ్వాన్స్‌గా పంపిస్తానని నమ్మించాడు. కాగా తన ఖాతా నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసేందుకు గూగుల్ పే యాప్‌ను ఓపెన్ చేసి తాను చెప్పిన వివరాలు నమోదు చేయాలని చెప్పాడు. ఆ వ్యక్తి చెప్పిన వివరాలను యాప్‌లో నమోదు చేయగానే శ్రీనివాసరావు బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు రెండు విడతల్లో రూ.38వేలు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. వెంటనే సదరు వ్యక్తి నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు గ్రహించిన శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| మిర్చి | 20,100 | 12,000 |
| మిర్చి తాలు | 11,800 | 6,000 |
| కందులు | 9,300 | 8,300 |
| పెసలు | 8,011 | 4,000 |
| పత్తి | 7,450 | 5,000 |

– ఖమ్మం వ్యవసాయం

# సీసీఐ విక్రయాలకు తెర

- మద్దతు ధరకు మించి ప్రైవేట్ మార్కెట్‌లో పత్తికి రేటు
- ఫలితంగా కాటన్ కార్పొరేషన్ కేంద్రాలకు రాని రైతులు
- ఉమ్మడి జిల్లాలో 7.40 లక్షల క్వింటాళ్లు కొన్న సీసీఐ
- మరో 6.90 లక్షల క్వింటాళ్లను కొనుగోలు చేసిన వ్యాపారులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులుతీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తికి ధర పెరగడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలకు తెర పడింది. పత్తికి ప్రభుత్వం రూ.7,020 మద్దతు ధర నిర్ణయించగా.. ప్రస్తుతం ప్రైవేట్ మార్కెట్‌లో అంతకుమించి నాణ్యత ఆధారంగా రూ.7,675 వరకు ధర లభిస్తోంది. దీంతో రైతులు ప్రైవేట్ మార్కెట్‌కు వెళ్తున్న నేపథ్యాన సీసీఐ కొనుగోళ్లు నిలిచిపోయాయి. గడిచిన రెండేళ్లు క్వింటా పత్తికి రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు ధర పలకడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల అవసరం లేకుండా పోయింది. ఈ ఏడాది మాత్రం సీజన్‌లో అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, ఎగుమతులు లేకపోవడంతో బేలు, సీడు ధరలు పడిపోయాయి. ఫలితంగా పత్తి ధర రూ.6 వేల నుంచి రూ.6,500గా పలికింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తేమ శాతం ఆధారంగా రూ.7,020 గరిష్ట ధర నిర్ణయించి సీసీఐని రంగంలోకి దింపింది. ఈమేరకు నవంబర్ చివరి నుంచి జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు.

**ఫిబ్రవరిలో పుంజుకున్న ధర**

ఉమ్మడి జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 7.40 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఖమ్మం జిల్లాలో పది జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేయగా ఎనిమిది మిల్లులు ముందుకొచ్చాయి. వీటి ద్వారా 4,40,175 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు మిల్లుల్లో 2,94,832 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. నవంబర్ చివరి వారం నుంచి మార్చి రెండోవారం వరకు కొనుగోళ్లు కొనసాగాయి. అయితే, ఫిబ్రవరి మూడో వారం నుంచే పత్తి ధర పుంజుకుని, నాలుగో వారానికి ప్రైవేట్ మార్కెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.7,020 మార్క్ దాటింది.

**గ్రామాల్లో వ్యాపారుల కొనుగోళ్లు..**

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ల ద్వారా వ్యాపారులు 7.90లక్షల క్వింటాళ్ల పత్తిని మార్చి మూడోవారం వరకు కొనుగోలు చేశారు. సీసీఐతో పోలిస్తే ప్రైవేట్ వ్యాపారుల కొనుగోళ్లు సుమారు 50వేల క్వింటాళ్ల మేర తక్కువగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 5,22,004 క్వింటాళ్లు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 1,69,865 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరకు మించి వస్తుండడంతో సీసీఐ కొనుగోళ్లకు తెరపడగా... వ్యవసాయ మార్కెట్లు, గ్రామాల్లో వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు.

**బేలు, సీడ్ ధర పెరగడంతో డిమాండ్**

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో బేలు, సీడ్ ధరలు పెరగటంతో ఇక్కడ పత్తికి డిమాండ్ వచ్చింది. ఫిబ్రవరి ఆరంభం వరకు బేలు(324 కిలోలు) ధర రూ.54వేలు ఉండగా.. ఇప్పుడు రూ.60 వేలకు చేరింది. ఇక రూ.2,400గా ఉన్న సీడ్ క్వింటా ధర రూ.3 వేలకు పెరిగింది. దీంతో రూ.6,600 పలికిన పత్తి ధర ఏకంగా రూ.7,675 చేరడం విశేషం. ఇలా ధర పెరగడంతో నిల్వ చేసిన పత్తిని రైతులు, కొందరు వ్యాపారులు విక్రయానికి మొగ్గు చూపుతున్నారు. కొద్ది రోజులుగా ఖమ్మం తదితర మార్కెట్లో విక్రయాలు పెరిగాయి. పంట సీజన్ ఆరంభంలో ఖమ్మం మార్కెట్‌కు నిత్యం 30 వేల నుంచి 40 వేల బస్తాల పత్తి వచ్చినా సీసీఐ కేంద్రాలు ప్రారంభమయ్యాక తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం ధర పెరగడంతో సీసీఐ కేంద్రాలకు వెళ్లకుండా పంట నిల్వ చేసిన రైతులు వ్యవసాయ మార్కెట్లకు వస్తున్నారు. దీంతో ఖమ్మం మార్కెట్‌కు నిత్యం 3 వేల నుంచి 4 వేల బస్తాల పత్తి విక్రయానికి వస్తోంది.

**ఆంక్షలతో ఇక్కట్లు**


జిన్నింగ్ మిల్లులో పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

సీసీఐ కేంద్రాల్లో తేమ తదితర ఆంక్షలను కఠినం చేయటంతో రైతులు ఇబ్బందిపడ్డారు. తేమ అధికంగా ఉందని చెబుతూ క్వింటాకు ఆరు నుంచి ఏడు కిలోల తరుగు తీస్తుండగా.. ఇదే అదునుగా వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని బినామీల పేరిట సీసీఐ కేంద్రాల్లో విక్రయించి లాభాలు దండుకున్నారు. కాగా, సీసీఐ కొనుగోలు చేసిన పత్తికి సంబంధించిన రైతులకు ఇంకా పూర్తిస్థాయిలో నగదు అందలేదు. దీంతో పలువురు రైతులు సీసీఐ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే, బ్యాంకుఅకౌంట్, ఆధార్ నంబర్ల వంటి సమాచారం సక్రమంగా ఇవ్వకపోవడంతో చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

**చెల్లింపులు కొనసాగుతున్నాయి..**



ప్రైవేట్ మార్కెట్లలో పత్తికి ధర పెరగడంతో రైతులు అక్కడే పంట విక్రయిస్తున్నారు. దీంతో సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తికి సంబంధించిన పైకం చెల్లింపులు కొనసాగుతున్నాయి. కొందరు సరైన వివరాలు ఇవ్వకపోవడంతో జాప్యం జరుగుతోంది. ఆయా రైతులకు సమాచారం ఇచ్చి వివరాలు సేకరిస్తూ నగదు జమ అయ్యేలా కృషి చేస్తున్నాం.

– ఎం.ఏ.అలీం, ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

# యథేచ్ఛగా ఇసుక రవాణా

- పాలేరు, ఆకేరు అడ్డాగా చెలరేగుతున్న మాఫియా
- ఫలితంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- అయినా పట్టింపు లేనట్లుగా అధికారులు


సుద్దవాగుతండా వద్ద పాలేరు నుండి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్


ఇసుక తరలింపుతో హైదర్‌సాయిపేట వద్ద అడుగంటిన ఆకేరు

తిరుమలాయపాలెం: మండలంలోని పాలేరు, ఆకేరు వాగుల నుండి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. రాత్రీపగలు తేడా లేకుండా దందా జరుగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. తమకు కుదిరినప్పుడో లేక ఫిర్యాదు అందినప్పుడో తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటుండడంతో మాఫియా చెలరేగిపోతోంది. ఇదంతా పక్కన పెడితే ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపుతో వాగుల్లో భూగర్భజలాలు అడుగంటి రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

**వరదతో భారీగా చేరిన ఇసుక**

తిరుమలాయపాలెం మండలానికి ఇరువైపులా పాలేరు, ఆకేరు ప్రవహిస్తున్నాయి. వీటిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు భూగర్భ జలాల పెంపుదలకు దోహదం చేశాయి. గత ఏడాది ఈ రెండు నదులు ఉధృతంగా ప్రవహించడంతో ఇసుక మేటలు పుష్కలంగా వచ్చి చేరాయి. దీంతో ఇసుకపై కన్నేసిన వ్యాపారులు కొద్ది నెలలుగా యథేచ్ఛగా తవ్వి ఖమ్మం తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మండలంలో ఇసుకపై నిషేధాజ్ఞలు ఉన్నా ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్తుండగా, రహదారిపై గుర్తించినప్పుడే పోలీసులు అప్పుడప్పుడు పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు.

**గుంతలు తవ్వించినా...**

కొద్ది నెలల క్రితం మండలంలోని సుద్దవాగు తండా రెవెన్యూ పరిధిలో ఇసుక ట్రాక్టర్లు రాకుండా జేసీబీతో గుంతలు తవ్వించారు. అయినా వ్యాపారులు మరో మార్గం ద్వారా ఇసుక తరలింపు మొదలుపెట్టారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారుల నిరంతర నిఘా లేకపోవడంతో వ్యాపారుల దందా మండలంలోని సుద్దవాగుతండా, హైదర్‌సాయిపేట, అజ్మీరతండా, పిండిప్రోలు ప్రాంతాల్లోని పాలేరు, ఆకేరు నదుల మీదుగా సాగుతోంది. దీనికి తోడు మహబూబాబాద్, డోర్నకల్, సూర్యాపేట ప్రాంతాల వ్యాపారులు సైతం రంగంలోకి దిగడంతో నీటితో కళకళలాడాల్సి ఉండగా పాలేరు, ఆకేరు అడుగంటాయి. దీంతో పరివాహక ప్రాంతాల రైతుల వరి పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కులను కట్టడి చేయాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

**ప్రత్యేక బృందాలను నియమిస్తాం...**

పాలేరు, ఆకేరు నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు తెలియడంతో ఆ ప్రాంతాలకు వెళ్లకుండా జేసీబీతో గుంతలు తవ్వించాం. అలాగే, ట్రాక్టర్ల యజమానులకు భారీగా జరిమానా విధించాం. అయినా కొందరు ఇసుక తరలిస్తున్నట్లు తెలిసింది. పోలీస్, ఇతర శాఖలతో సంయుక్తంగా ఇసుక రవాణా కట్టడికి బృందాలను ఏర్పాటుచేస్తాం.

– పీ.వీ.రామకృష్ణ, తహసీల్దార్

## ఖమ్మంలో 'రజాకార్' చిత్ర బృందం


మాట్లాడుతున్న నటి అనసూయ, పక్కన చిత్రబృందం

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ పూర్వ చరిత్రతో రూపొందించిన 'రజాకార్' చిత్ర బృందం గురువారం ఖమ్మం వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఆదిత్య థియేటర్‌కు చిత్ర దర్శకుడు ఎట్ట సత్యనారాయణ సహా నటీనటులు చేరుకుని కాసేపు సినిమా వీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను చాటి చెప్పేలా రూపొందించిన రజాకార్ సినిమాను అందరూ ఆదిరించాలని కోరారు. నటీనటులు అనసూయ, భరద్వాజ్ బాబీసింహ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డాక్టర్ అంజిరెడ్డి, సంగీత దర్శకుడు బీమ్స్ సిసిలిరియోతో పాటు వంగల పూజ, తిరుమల తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

## హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మోహన్‌బాబు

ఖమ్మంక్రైం: హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగిన సమయాన వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యాన ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు ఆధ్వర్యాన గురువారం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఖమ్మంలోని జెడ్పీ సెంటర్ వద్ద చేపట్టిన తనిఖీల్లో హెల్మెట్ లేని వారికి వాడకం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. అలాగే, నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న ఆరు ద్విచక్ర వాహనాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు రవి, వెంకన్న, సాగర్ పాల్గొన్నారు.

### 'కేజ్రీవాల్ అరెస్టు అక్రమం'

ఖమ్మం మామిళ్లగూడెం: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అక్రమమని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు నల్లమోతు తిరుమలరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుట్ర పూరితంగా ఈడీ, సీబీఐలను ప్రతిపక్షాలపై ప్రయోగిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయాన తమ పార్టీని దెబ్బతీసేందుకే కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించారని తెలిపారు.

## చర్చలకు మేం సిద్ధం..

- ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే సానుకూలంగా వ్యవహరించడం లేదు
- మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్

చర్ల: చర్చలకు తాము సిద్ధంగా ఉన్నప్పటికీ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వమే సానుకూలంగా స్పందించడం లేదని మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు లేఖ విడుదల చేశారు. మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ నిరంతరం ప్రకటిస్తున్నారని, తాజాగా బీజాపూర్ జిల్లాలోని జంగ్లాలో కూడా ఈ మేరకు ప్రకటన చేశారని, అయితే చర్చలకు సంబంధించి తాము చేసిన ప్రకటనపై స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు. తమ పార్టీ ప్రభుత్వం ముందుంచిన సమస్యలకు సమాధానం ఇవ్వకుండా చర్చల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. రైతులు, కార్మికులు, బలహీన వర్గాల ప్రయోజనాలు పరిరక్షించాలనేది తమ ఏకైక డిమాండ్ అని పేర్కొన్నారు. చర్చలకు అనుకూల వాతావరణ కల్పించాలని, ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలపై దాడులు ఆపాలని, కొత్తగా ఏర్పాటు చేస్తున్న బేస్ క్యాంపులను నిలిపివేయాలని, సాయుధ బలగాలను 6 నెలల పాటు బ్యారక్‌లకు మాత్రమే పరిమితం చేయాలనేది తమ షరతులని వివరించారు. దీనికి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తే తాము చర్చలకు సిద్ధమని ప్రకటించారు. ఆ దిశగా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు పాత్రికేయులు, పౌరులు, ప్రగతిశీల ప్రజాస్వామ్య మేధావులు, పౌర హక్కుల సంఘాలు, మానవహక్కుల సంఘాలు కృషి చేయాలని వికల్ప్ కోరారు.

### ఇంద్ర బస్సు జప్తునకు కోర్టు ఆదేశం

**ప్రమాద బాధితుడికి పరిహారం చెల్లించకపోవడంతో తీర్పు**

ఖమ్మం లీగల్: బస్సు కారణంగా జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించినా స్పందించకపోవడంతో ఆర్టీసీకి చెందిన ఇంద్ర బస్సును జప్తు చేయాలని ఖమ్మం ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి దేవినేని రామప్రసాదరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంనకు చెందిన విద్యార్థి నీలగొండరాసి చంద్రకాంత్‌ను నల్లగొండ జిల్లా హాలియా పోలీస్‌స్టేషన్ పరిధిలో 2019 అక్టోబర్ 14న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా కుడి పాదానికి తీవ్ర గాయమైంది. దీంతో ఆయన రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని ఖమ్మం కోర్టులో 2020 సెప్టెంబర్ 30న కేసు దాఖలు చేశారు. వాదనలు విన్న ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి బాధితుడికి రూ.6,14,630 పరిహారాన్ని 7.5శాతం వడ్డీతో సహా కేసు దాఖలు చేసిన తేదీ నుంచి చెల్లించాలని ఆర్టీసీ ఎండీని ఆదేశించింది. అయినా చెల్లించకపోవడంతో చంద్రకాంత్ మళ్లీ కోర్టును ఆశ్రయించగా ఇంద్ర బస్సును జప్తు చేయాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో పిటీషనర్ తరఫున న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ వాదించారు.

### ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఖమ్మంక్రైం: పేకాట ఆడుతున్న ఐదుగురిని ఖమ్మం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం.. ఖమ్మం బైపాస్ రోడ్డులోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్నారని ఏసీపీ రమణమూర్తికి బుధవారం రాత్రి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్‌ఐ రఫీ సిబ్బందితో కలిసి దాడి చేయగా పేకాట ఆడుతున్న ఖమ్మం రోటరీనగర్, శ్రీనగర్‌కాలనీ, మణుగూరు, కొత్తగూడెంకు చెందిన ఐదుగురు పట్టుబడ్డారు. వీరిని అరెస్ట్ చేసి రూ.16,900, ఐదు ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

## తప్పిన ప్రమాదం..


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కామేపల్లి: ప్రమాదవశాత్తు నర్సరీకి నిప్పు అంటుకోగా, రైతుల అప్రమత్తతతో పెనుప్రమాదం తప్పింది. మండలంలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన పుచ్చకాయల బాబుకు చెందిన నర్సరీ సమీపాన గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చెత్తకు నిప్పుపెట్టారు. గాలికి మంటలు వ్యాపించి నర్సరీలోని నెట్, ట్రేలకు అంటుకున్నాయి. ఈవిషయాన్ని గమనించిన రైతులు మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా పొగ కారణంగా సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇల్లెందు నుంచి వాహనంతో చేరుకున్న ఉద్యోగులు మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

### 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఏన్కూరు: మండలంలోని గార్లఒడ్డు, ఏన్కూరులో ఖమ్మం డీటీఎఫ్, కారేపల్లి ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నాటుసారాయి స్థావరాలపై దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే, నాలుగు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో డీటీఎఫ్ సీఐ కరుణశ్రీ, కారేపల్లి ఎక్సైజ్ ఎస్‌ఐ వసంతలక్ష్మి, ఉద్యోగులు వలరాజ్, లాజర్, నాగేశ్వరావు, విశ్వనాథం, కృష్ణవేణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో ఆర్టిజన్ ఆత్మహత్య


శేషం రాజు(ఫైల్)

భద్రాచలంఅర్బన్/పాల్వంచ: బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి కేటీపీఎస్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ పట్టణంలోని జయమ్మ కాలనీకి చెందిన, కేటీపీఎస్ ఆర్టిజన్ ఉద్యోగి తంగెళ్ల శేషంరాజు (40) పిల్లల చదువులకు కోసం అప్పు చేశాడు. అప్పుల బాధ భరించలేక కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్నాడు. బుధవారం బంధువుల ఇంటికి వెళ్లొచ్చిన ఆయన మరింత వేదనతో కనిపించాడు. భార్య శైలజ ఆరా తీసినా ఏమీ లేదంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. గురువారం శేషంరాజు భద్రాచలం వద్ద బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ విజయలక్ష్మి కేసు నమోదు చేశారు. కాగా పాల్వంచ జయమ్మ కాలనీలోని రాజు నివాసగృహం వద్ద మృతదేహాన్ని కార్మిక సంఘాల నేతలు చారుగుండ్ల రమేశ్, కె.రవికుమార్, తోట కోటేశ్వరరావు, ఆర్.శ్రీనివాస్, ముత్యాల రాంబాబు, సల్లం పరమేశ్, కాల్వ రవికుమార్, సుభాని, రాంబాబు, రవిబాబు, డి.రాధాకృష్ణ, ఎం.నర్సింహా రెడ్డి తదితరులు సందర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

### వైన్ షాపుల్లో తనిఖీ


వైన్స్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన జిల్లా కేంద్రంలోని వైన్ షాపుల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. పరిమితికి స్టాక్ కలిగి ఉండడమే కాక బల్క్ అమ్మకాలు జరగకుండా నిరోధించేందుకు తనిఖీలు చేసినట్లు తెలిసింది. ఈసందర్భంగా స్టాక్‌బుక్ ఆధారంగా వైన్స్‌లోని సరుకును పరిశీలించారు. తనిఖీల్లో ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్–1, 2 ఉద్యోగులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్లుప్తంగా...

### ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తన విచారణ జరగడం లేదంటూ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కస్టడీ సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించడం లేదని, పీఎస్‌లో నిద్రపోవడానికి సరైన సౌకర్యాలు లేవని, విచారణ పూర్తైన తర్వాత తిరిగి జైలుకు తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరడంతోపాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ప్రణీత్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌లో వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి.. పిటిషన్‌ను కొట్టివేస్తూ గురువారం తీర్పు వెలువరించారు. 2023లో అక్రమంగా ప్రతిపక్ష పార్టీ నేతల ఫోన్ ట్యాంపింగ్‌కు ప్రణీత్‌రావు పాల్పడ్డారు. ఇది చాలా తీవ్ర నేరమని.. నిబంధనల మేరకే ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేస్తోందని వాదనల సందర్భంగా పీపీ నివేదించారు. సాక్ష్యాలను అందించడంలో భాగంగానే రమేశ్ విచారణ జరిగే ప్రాంతానికి వచ్చారు తప్ప.. విచారణలో పాల్గొనలేదన్నారు. 4 రోజుల కస్టడీ పూర్తయిందని, మరో 3 రోజులు మాత్రమే ఉందని చెప్పారు. పీపీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి ప్రణీత్‌రావు పిటిషన్ కొట్టివేశారు.

### నా కొడుకును రక్షించండి

**అబ్దుల్ మహ్మద్ ఆర్పద్ తండ్రి సలీం వేడుకోలు**

మల్లాపూర్(హైదరాబాద్): అమెరికాలో కిడ్నాప్‌నకు గురైన తన కొడుకు అబ్దుల్ మహ్మద్ ఆర్పద్‌ను కాపాడాలని తండ్రి అబ్దుల్ సలీం ఆవేదనతో వేడుకుంటున్నాడు. నాచారం ఏరియాకు చెందిన ఆర్పద్‌ను అమెరికాలో డ్రగ్స్ మాఫియా కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. గురువారం మీడియాతో మాట్లాడుతూ రెండు రోజులైనా ఫోన్ రాకపోవడంతో అక్కడే ఉన్న తమ బంధువులకు సమాచారం ఇచ్చినా, వారికి కూడా అతని ఆచూకీ తెలియలేదన్నారు. కిడ్నాపర్ల చెర నుంచి తన కొడుకు రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

**పోలీసుల ఆరా**

ఆర్పద్ కిడ్నాప్ విషయం తెలుసుకున్న నాచారం పోలీసులు తండ్రి సలీంను పీఎస్‌కు పిలిచి ఆరా తీశారు. ఆర్పద్ ఎప్పుడు అమెరికాకు వెళ్లాడు.. చివరిసారి ఎప్పుడు మాట్లాడాడు, అమెరికాలో ఎక్కడ ఉంటున్నాడు.. ఇంతకు ముందు ఎవరైనా అక్కడ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు చెప్పాడా అనే కోణంలో వివరాలు అడిగారు.

# యాదాద్రిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



గురువారం యాదాద్రిలో ప్రధాన కలశంతో పాటు వెండి, బంగారు కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు, యజ్ఞచార్యులు.

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన గురువారం ప్రధానాలయంలో వేకువజామున నిత్య పూజలు నిర్వహించిన ఆచార్యులు వేద మంత్రాలతో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శ్రీస్వామి అమ్మవార్లకు అష్టోత్తర శతఘటాభిషేకం చేశారు. 108 కలశాలలో ఫల రసాలతో, పంచామృతాలతో, శుద్ధ జలంతో స్వయంభూలకు, బంగారు ప్రతిష్టామూర్తులకు వేద మంత్రాలు, పారాయణాలతో శతఘటాభిషేక మహోత్సవం జరిపారు. రాత్రి 9.30 గంటలకు శ్రీస్వామి వారికి శృంగార డోలోత్సవం ఘనంగా జరిపించి ఉత్సవాలకు ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రద్దు చేసిన నిత్య కళ్యాణం, సుదర్శన నారసింహ హోమం వేడుకలు శుక్రవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. కాగా ఉదయం, సాయంత్రం జరిగిన వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, అధికారులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా ధర్మపురి నృసింహుడి కల్యాణం



నృసింహుడి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మపురి: జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజైన గురువారం ఆలయంలోని శేషప్ప వేదికపై ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ యాస్మిన్ బాషా పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చారు. రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలవరకు వేడుక జరిపించారు. ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ రాంబాబు డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

# అజ్ఞాతంలోకి ప్రభాకర్‌రావు!

## ప్రణీత్‌రావు సస్పెండ్ కాగానే ఎస్‌ఐబీ మాజీ చీఫ్ అప్రమత్తం

- ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు పోలీసుల అనుమానం
- మాజీ డీఎస్పీ కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం
- 2018 నుంచే మొదలైన అక్రమ ట్యాపింగ్ దందా
- ఇజ్రాయెల్ నుంచి అత్యాధునిక ఉపకరణాలు ఖరీదు



సాక్షి, హైదరాబాద్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరించిన స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు అజ్ఞాతంలోకి వెళ్లినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈయన ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కేసును అక్కడి నుంచే నిశితంగా గమనిస్తున్న ప్రభాకర్‌రావు.. అతని పోలీసు కస్టడీ ముగిసిన తర్వాత హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోపక్క సిట్ అధికారులు ప్రణీత్ రావును ఐదో రోజైన గురువారమూ బంజారాహిల్స్ ఠాణాలో ప్రశ్నించారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాల ఆధారంగా మరో నలుగురు పోలీసులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. వీళ్లు గతంలో 'ప్రభాకర్‌రావు సైన్యం'లో కీలక సభ్యులని సమాచారం.

### హోదా ఏదైనా బాధ్యత మాత్రం చీఫే

రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొన్నాళ్లు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీగా పని చేసిన ప్రభాకర్‌రావును ప్రభుత్వం ఏరికోరి ఎస్ఐబీకి డీఐజీని చేసింది. ఐజీగా పదోన్నతి పొందినా అక్కడే కొనసాగారు. చివరకు 2020లో పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును నాటి ప్రభుత్వం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియమించింది. హోదా ఏదైనా ఎస్ఐబీ చీఫ్‌గానే కొనసాగారు. ఇలా ఏళ్లుగా అక్కడ పాతుకుపోయిన ప్రభాకర్‌రావు తనకంటూ ఓ సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

### గత ఎన్నికల నేపథ్యంలోనే అడ్డదారి

ఎస్ఐబీలో 2017 వరకు లీగల్ ఇంటర్‌సెప్షన్ (ఎల్ఐ)గా పిలిచే అధికారిక ట్యాపింగ్ మాత్రమే జరిగింది. అయితే ఆ తర్వాత ఎన్నికలు సమీపిస్తుండటం, ప్రతిపక్ష పార్టీలు పుంజుకోవడం గమనించిన ప్రభాకర్‌రావు, అప్పటి కొందరు కీలక రాజకీయ నాయకులు.. అక్రమ ట్యాపింగ్‌పై దృష్టి పెట్టారు. అయితే ప్రతిపక్ష నేతలు తరచుగా వేర్వేరు నంబర్లతో సంప్రదింపులు జరుపుతుండటంతో ప్రభాకర్‌రావు బృందం రష్యా, ఇజ్రాయెల్‌లో పర్యటించి వచ్చింది. ఆయా దేశాల్లో అందుబాటులో ఉన్న ఆధునిక ట్యా పింగ్, ఇతర నిఘా పరికరాలను పరిశీలించి వచ్చింది. ఏవేవి ఖరీదు చేయాలో చెప్పాల్సిందిగా పేర్కొంటూ కొందరు పెద్దలకు నివేదిక సమర్పించింది.

### ప్రణీత్‌రావు సస్పెన్షన్‌తో అలర్ట్

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మార్పిడి జరిగిన వెంటనే ప్రభాకర్‌రావు తన ఓఎస్డీ పోస్టుకు రాజీనామా చేశారు. ఆపై కొ న్నాళ్లు హైదరాబాద్‌తో పాటు తన స్వగ్రామంలో ఉ న్నారు. అయితే ఈ నెల మొదటి వారంలో ప్రణీత్ రావుపై సస్పెన్షన్ వేటు పడటంతో అప్రమత్తం అయ్యారు. కుటుంబంతో కలిసి విహార యాత్రకు వెళ్తున్నట్లు చెప్పి నగరం దాటిన ప్రభాకర్‌రావు అ ట్నుంచి అటు అమెరికా వెళ్లిపోయారని పోలీసులు భావిస్తున్నారు. ప్రణీత్ రావు కస్టడీ ముగిసిన తర్వా త ప్రభాకర్‌రావు విషయంలో పోలీసు విభాగం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

### కొనుగోలులో కీలక పాత్ర పోషించిన రవి పాల్

టెక్నికల్ అనుభవం ఉన్న రవి పాల్ అనే నిపుణుడు గతంలో ఇంటిలిజెన్స్ విభాగానికి కన్సల్టెంట్, అడ్వైజర్‌గా పని చేశారు. ప్రభాకర్‌రావుతో పాటు కొందరు కీలక అధికారులతో సన్నిహితంగా మెలిగారు. రవి పాల్ సూచనల మేరకు ప్రభాకర్‌రావు ఇజ్రాయెల్ నుంచి సూట్‌కేస్‌లో ఇమిడిపోయి ఉండే అక్రమ ట్యాపింగ్ పరికరం ఖరీదు చేశారు. దీన్ని ప్రణీత్‌రావు టీమ్ ఓ వాహనంలో పెట్టుకుని టార్గెట్ చేసిన వ్యక్తి ఇల్లు, కార్యాలయం సమీపంలో మాటు వేసేది. ఈ పరికరానికి 300 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతి ఫోన్ ద్వారా జరిగే కమ్యూనికేషన్ తెలుసుకునే సామర్థ్యం ఉంది.

### 'ఆదిలాబాద్'కోసం వినియోగించారు

2018లో ఆదిలాబాద్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతారణం నెలకొన్న సమయంలోనూ ఎస్ఐబీ అధికారులు ఈ బ్రీఫ్‌కేస్ ఉపకరణాన్ని వినియోగించారు. రెండు వర్గాలకు చెందిన కీలక నేతలు ఇద్దరిని పట్టుకోగలిగారు. ఈ వ్యవహారాల్లో ప్రణీత్ రావుకు కుడిభుజంగా వ్యవహరించిన ఆరుగురు అధికారులను సిట్ గుర్తించింది. వీరిలో ఇద్దరి నుంచి ఇప్పటికే వాంగ్మూలాలు నమోదు చేయగా.. మరో నలుగురికి విచారణకు హాజరుకావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

# పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

## సమీక్షలో సీఎస్ శాంతికుమారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ, రెవెన్యూ, రవాణా తదితర శాఖల అధికారులతో గురువారం ఆమె సచివాలయంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఎలా పనిచేశారో.. అదే స్ఫూర్తితో రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణలోనూ మరింత సమర్థవంతంగా పని చేయాలని కోరారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు ఆయా రాష్ట్రాల చెక్ పోస్టులతో కలసి సమన్వయంతో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో కూడా వివిధ శాఖలు చెక్ పోస్టులను ఏర్పాటు చేశాయన్నారు. ఇప్పటివరకు పోలీసు శాఖ రూ.10 కోట్ల నగదు, పలు లైసెన్స్ లేని ఆయుధాలు, పేలుడు పదార్థాలు, జిలెటిన్ స్టిక్స్, బంగారాన్ని స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వివిధ వస్తువులను నిల్వ చేసేందుకు అవకాశమున్న 25 గోదాములను గుర్తించి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచామని వెల్లడించారు. మరో 141 గోదాములు, 912 వివిధ వస్తువుల తయారీ కేంద్రాలపై కూడా నిఘా ఉంచామన్నారు. మద్యం అక్రమ రవాణాకు అవకాశమున్న ఐదు రైలు మార్గాలను గుర్తించి మద్యం నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, పీసీసీఎఫ్ డోబ్రియల్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, అడిషనల్ డీజీ ఎస్.కె. జైన్ పాల్గొన్నారు.

# ఎన్నికల బందోబస్తుకు 145 కంపెనీల కేంద్ర బలగాలు



- ఇప్పటికే రంగంలోకి 60 కంపెనీలు
- శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న పార్లమెంటుఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ తెలిపారు. ఎన్నికల తేదీనాటికి మొత్తం 145 కంపెనీల కేంద్ర బలగాలు బందోబస్తు విధుల్లో ఉండే అవకాశం ఉన్నట్టు చెప్పారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గురువారం ఆయన 'సాక్షి'కి తెలిపారు. స్థానిక పోలీసులతోపాటు ఇప్పటికే 60 కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రవ్యాప్తంగా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. నిబంధనల ప్రకారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కనీసం మూడుకు తగ్గకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 440 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.10 కోట్ల వరకు నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో కవాతు నిర్వహిస్తున్నామని సంజయ్‌కుమార్ జైన్ వెల్లడించారు.

**జిల్లా వార్తలు**

### పెద్దాస్పత్రిలో మోకీలు శస్త్రచికిత్స



మల్లేశ్వరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఆస్పత్రి అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: చాన్నాళ్ల తర్వాత ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు మోకీలు శస్త్రచికిత్స నిర్వహించారు. జూలూరుపాడుకు చెందిన ఏ.మల్లేశ్వరి(56) మూడేళ్లుగా మోకాళ్ల నొప్పులతో ఇబ్బంది పడుతుండగా, నడవడం కష్టంగా మారటంతో పెద్దాస్పత్రిలోని ఆర్థో వైద్యులను సంప్రదించింది. పరీక్షించిన వైద్యులు ఆమె మోకీళ్లు పూర్తిగా అరిగినట్లు గుర్తించారు. గత వారం ఆమెకు శస్త్రచికిత్స చేయగా ప్రస్తుతం కోలుకోవడంతో గురువారం ఆమెను డిశ్చార్జ్ చేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన మోకీలు శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేసినట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ తెలిపారు.

### పీఎంఓ నుంచి కేన్సర్ బాధితుడికి రూ.3 లక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు చొరవతో కేన్సర్ బాధితునికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ.3 లక్షల ఆర్థికసాయం మంజూరైంది. ఈమేరకు పీఎంఓ నుంచి ఎంపీ నామకు లేఖ అందింది. వైరా మండలం సోమవరం గ్రామం సుందరయ్యనగర్‌కు చెందిన కట్ల శ్రీకాంత్ కుమారుడు ధృవంశ్ కేన్సర్‌తో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెరుగైన చికిత్స కోసం పెద్దమొత్తంలో డబ్బు అవసరం కావడంతో శ్రీకాంత్ ఎంపీని ఆశ్రయించాడు. దీంతో ఆయన ప్రధానమంత్రి కార్యాలయంతో మాట్లాడి రూ.3 లక్షలు మంజూరు చేయించగా, బాధిత కుటుంబం ఎంపీకి కృతజ్ఞతలు తెలిపింది.

# అభివృద్ధి, మనుగడే ధ్యేయంగా..

## 'గూడెం'లో నడుం బిగించిన వ్యాపార సంఘాలు

- 14 అంశాల సాధనే లక్ష్యంగా ముందడుగు
- సీఎం, డిప్యూటీ సీఎం, సీఎస్‌లకు పోస్టుకార్డులు
- కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీకి నేరుగా వినతి



సీఎం, మంత్రులు, సీఎస్‌కు పంపిస్తున్న పోస్ట్ కార్డులు



కలెక్టర్‌తో చర్చిస్తున్న వ్యాపార సంఘం ప్రతినిధులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెంలో బొగ్గు తవ్వకాల ప్రారంభ సమయాన సింగరేణి అధికారుల సూచనల మేరకు ఇక్కడ వ్యాపారాలు ఏర్పాటుచేసిన వారు తిరిగి వెళ్లిపోతున్నారు. ఈనేపథ్యాన వ్యాపారులు వలస వెళ్లకుండా చూస్తూనే, పట్టణ అభివృద్ధే ధ్యేయంగా కొత్తగూడెం వ్యాపారుల సంక్షేమ సంఘం నడుం బిగించింది. కొన్నేళ్ల క్రితం వరకు సింగరేణి ఉద్యోగులు, పట్టణానికి రోజూ వచ్చివెళ్లే ప్రజలతో వ్యాపారాలు బాగా నడిచేవి. కానీ ఆన్‌లైన్, కార్పొరేట్ సంస్థల తాకిడికి వస్త్రదుకాణాలు, కిరాణా, బంగారం, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్.. ఇలా ఒకటేమిటి అన్నీ మూతపడే స్థితికి చేరాయి. గత ఐదేళ్లలో పట్టణం నుంచి సుమారు 6 వేల కుటుంబాల్లోని 20వేల మంది వలస వెళ్లినట్లు వ్యాపార సంఘం నాయకులు అంచనా వేస్తున్నారు. దీంతో వలసలను అరికట్టి పట్టణాభివృద్ధికి నడుం బిగించిన వ్యాపారస్తులు సమైక్యమై 'కొత్తగూడెం వ్యాపారస్తుల సంక్షేమ సంఘం'గా ఏర్పడ్డారు. వీరి ఆధ్వర్యాన పట్టణ అభివృద్ధి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆచరణ రూపం దాల్చేలా కృషి చేస్తున్నారు.

### పట్టణాభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



కొత్తగూడెం పట్టణాభివృద్ధి, మనుగడ కోసం 14 అంశాలతో నివేదిక రూపొందించాం. వీటి సాధనకు ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీని కలిశాం. అలాగే, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, సీఎస్‌కు పోస్టుకార్డులు పంపించాం. అందరూ సహకరిస్తే ఈ అంశాలు ఆచరణలోకి వచ్చి పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందనే నమ్మకం ఉంది.

– మొరిశెట్టి భవానీప్రసాద్, సంఘం కన్వీనర్

### నివేదికలోని కొన్ని అంశాలు..

కొత్తగూడెం పట్టణాభివృద్ధి కోసం 14 అంశాలను రూపొందించిన సంఘం బాధ్యులు వాటి సాధనకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఊరు అభివృద్ధి జరిగితే అన్ని వర్గాల వారికి పురోగతి ఉంటుందనే నమ్మకంతో ముందుకు వెళ్తున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, మేధావులు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం మనుగడ కోసం ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు వారు రూపొందించిన అంశాల్లో కొన్ని ఇలా ఉన్నాయి.

- కొత్తగూడెం రైతుబజార్, కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న విశాలమైన స్థలాన్ని అభివృద్ధి చేసి సెంటర్‌గా తీర్చిదిద్దాలి. రైతుబజార్ స్థలంలో జీ ప్లస్ 4 పద్ధతిలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే వ్యాపారాలు మళ్లీ జీవం పోసుకుంటాయి.
- కొత్తగూడెం నుంచి ప్రతిరోజూ కనీసం నాలుగు రైళ్ల రాకపోకలు జరిగేలా చూడాలి. తద్వారా భద్రాచలానికి వెళ్లి వచ్చే భక్తులతో ఇక్కడ వ్యాపారాల అభివృద్ధికి అవకాశం ఉంటుంది.
- జిల్లాలో సింగరేణి, ఐటీసీ, హెవీవాటర్‌ప్లాంట్, ఎన్ఎండీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్, నవభారత్ లాంటి సంస్థలు, వాటి అనుబంధ పరిశ్రమలు ఉన్నందున పారిశ్రామిక వేత్తలు, భద్రాచలానికి వచ్చివెళ్లే భక్తుల సౌకర్యార్థం కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలి.
- ఐటీ టవర్స్, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే కొత్త కోర్సులు రావడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.
- అసంపూర్తిగా ఉన్న కొత్తగూడెం బైపాస్ రోడ్డు, జాతీయ రహదారి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి.

# 'సహజ' ప్రతిభ సొంతం!

- టెన్నిస్‌లో సత్తా చాటుతున్న ఖమ్మం క్రీడాకారిణి
- అమెరికాలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉచిత చదువు
- అంతర్జాతీయ టోర్నీలకు వెళ్లేందుకు చేయూత కోసం ఎదురుచూపులు



ప్రాక్టీస్ చేస్తున్న సహజ

ఖమ్మం స్పోర్ట్స్: టెన్నిస్‌లో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించి జిల్లా కీర్తిని చాటుతోంది ఖమ్మంకు చెందిన యామలపల్లి సహజ. టెన్నిస్‌పై బాల్యం నుంచే ఆసక్తి పెంచుకున్న ఆమెకు మరింత ఎత్తు ఎదగాలనే ఆకాంక్ష ఉన్నా స్థోమత లేక దాతల చేయూత కోసం ఎదురుచూస్తోంది. తల్లిదండ్రులు ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌లో ఉన్న సమయాన అక్కడ శిక్షణలో రాటుదేలి జాతీయస్థాయి సెలక్టర్ల దృష్టిలో పడింది. అంచెలంచెలుగా ఎదుగుతూ భారత మహిళల టెన్నిస్ జట్టులో స్థానం సంపాదించుకుంది. ఈక్రమంలోనే జూనియర్ కేటగిరీలో 20వ ర్యాంకు సాధించడం విశేషం. అలాగే, వచ్చే నెల చైనాలో జరగనున్న టోర్నీకి భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. అయితే, అంతర్జాతీయ టోర్నీల్లో ఆడాలన్నా, అందుకు తగిన శిక్షణ పొందాలన్నా ఏటా రూ.30 లక్షల వరకు అవసరం కావడంతో స్పాన్సర్ల కోసం సహజ ఎదురుచూస్తోంది.

**తల్లిదండ్రుల ప్రోత్సాహంతో...**

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పదో ఏట నుంచే రాకెట్ పట్టిన సహజ అంచెలంచెలుగా ఎదిగింది. ఆమె తల్లిదండ్రులు భవానీప్రసాద్, సుప్రియ ఉద్యోగరీత్యా హైదరాబాద్ వెళ్తూ సహజకు సైతం అక్కడే శిక్షణ ఇప్పించారు. కొద్ది కాలం తర్వాత ఉన్నత చదువుల నిమిత్తం అమెరికా వెళ్లిన ఆమె ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రీషన్‌లో స్పోర్ట్స్ స్కాలర్‌షిప్‌తోనే ఉచితంగా డిగ్రీ పూర్తి చేసింది. అక్కడ టెన్నిస్ నేర్చుకునేందుకు ఫీజు కట్టలేని స్థితిలో ఉన్న యూట్యూబ్ ద్వారా పాఠాలు నేర్చుకుంది. అలాగే, అక్కడ అనేక టోర్నీల్లో సత్తా చాటింది. రెండేళ్ల క్రితం తిరిగి రాగా ప్రస్తుతం బెంగళూరులోని పీబీఐ టెన్నిస్ అకాడమీలో సీజర్‌మొరాల్స్ వద్ద శిక్షణ పొందుతోంది. 2021లో ప్రపంచ ర్యాంకింగ్‌లో 1,300 స్థానంలో ఉన్న సహజ ఇప్పుడు ప్రపంచ ర్యాంకింగ్‌లో 306, నేషనల్ ర్యాంకింగ్‌లో ద్వితీయ స్థానం, తెలంగాణలో మొదటి స్థానానికి చేరింది. మధ్య తరగతి కుటుంబానికి చెందిన సహజకు చేయూతనిచ్చేందుకు స్పాన్సర్లు ముందుకొస్తే దేశానికి ఖ్యాతి తీసుకొచ్చేలా సత్తా చాటే అవకాశముంది.

# రేగళ్ల గుంపును సందర్శించిన డీడబ్ల్యూఓ

- ట్రాక్టర్‌పై ప్రయాణం.. ఆపై కాలినడక
- గొత్తికోయల సమస్యలపై ఆరా



రేగళ్లగుంపులో గొత్తికోయలతో మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ విజేత



ట్రాక్టర్‌పై వెళ్తున్న డీడబ్ల్యూఓ, తదితరులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మండలం బచ్చువారిగూడెం గ్రామపంచాయతీ పరిధి రేగళ్ల గొత్తికోయల గుంపును భద్రాద్రి జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత గురువారం సాయంత్రం సందర్శించారు. రహదారి సౌకర్యం సరిగ్గా లేని గుంపును చేరుకునేందుకు ఆమె ఉద్యోగులతో కలిసి ట్రాక్టర్‌పై ప్రయాణించారు. ఆతర్వాత కాసేపు కాలినడకన వెళ్లి గుంపునకు చేరుకున్నారు. అక్కడ వలస గొత్తికోయలకు అందుతున్న సేవలను పరిశీలించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఆతర్వాత అశ్వారావుపేటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో విజేత విలేకరులతో మాట్లాడారు. రేగళ్ల గుంపులో తాగునీటి సౌకర్యం, వైద్య సేవలు కావాలని అక్కడి ప్రజలు కోరారని తెలిపారు. గొత్తికోయల యువతుల్లో చదువుకున్న వారు ఉంటే అక్కడే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసి ఉద్యోగం ఇచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతి తీసుకుంటామని చెప్పారు. తద్వారా పిల్లలు, గర్భిణుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా చూడవచ్చని తెలిపారు. మిగతా సమస్యలను కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ పీఓ రోజాకుమారి, సిబ్బంది ఉన్నారు. కాగా, ఇటీవలే రేగళ్లగుంపులో తాగునీటి సమస్యపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా స్పందించిన అధికారులు ట్యాంకర్ ద్వారా నీరు సమకూరుస్తున్న విషయం విదితమే.

# దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద తగ్గుతున్న గోదావరి



కుమ్మరిగూడెంలో ఆనకట్ట గోదావరి

అశ్వాపురం: అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. ఆనకట్ట వద్ద గురువారం 49.3 మీటర్లుగా నమోదు కాగా, మిషన్ భగీరథ ఇన్ టేక్‌వెల్ వద్ద నీటిమట్టం 48.9 మీటర్లు ఉంది. ఇన్ టేక్‌వెల్ ద్వారా భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇక్కడ నీటిమట్టం 48 మీటర్ల కంటే తగ్గితే నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతాయి. గత మూడేళ్ల క్రితం వేసవిలో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీరు భారీగా తగ్గి భారజల కర్మాగారం ఇన్ టేక్‌వెల్ వద్ద నీరు లేక కర్మాగారం షట్‌డౌన్ కావడంతో పాటు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది ఇప్పటివరకైతే నీటి సరఫరాకు ఇబ్బంది లేదని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు.